# భర్తల దౌర్జన్యం నశించాలి

విశాలాక్షికి కడుపులో మండిపోతూంది. ఒళ్ళంతా వాతలు తేలినయ్యేమో ఒళ్ళు కూడా భగభగ మండిపోతూంది. పొద్దుట్నుంచీ కన్నీళ్ళతోనే "భర్తల దౌర్జన్యం నశించాలి" అని మనసులోనే నినాదాలిస్తోంది. హఠాత్తుగా ఒక ఐడియా వచ్చింది-దాంతో ఆవేశం కూడా వచ్చింది. 'ఇట్లా లాభం లేదు భర్తలందరికీ బుద్ధి రావాలంటే కలం పట్టాలి' అనుకుంది విశాలాక్షి దీక్షబూనినట్లు. కలంపడ్తే బుద్ధెలా వస్తుందన్న అనుమానమొస్తే మరి కలమేకదా చైతన్య వాహిక ! ఏ చైతన్యం రావాలన్నా పత్రికా మాధ్యంలో కలంద్వారా రావల్సిందే కదా!

కానీ వచ్చిన చిక్కల్లా విశాలాక్షి ఇంతకుముందెపుడూ కలం పట్టలేదు. అంటే స్కూల్లో చదవలేదు రాయలేదు అని కాదు, ఆ మాట కొస్తే కాలేజీలో కూడా చదివింది.

ఎటొచ్చీ రచనలు చేయడానికి కలం పట్టలేదు. కానీ ఇపుడు విశాలాక్షికి ఆవేదన లోంచి ఆవేశం వచ్చింది. దుర్మార్గులైన భర్తలందరి మీదా కోపం వచ్చింది. పెట్టె అడుగున పడిఉన్న పెన్ను తీసి, పాళీ సరిచేసి, ఇంకు పోసింది. తెల్లకాగితాల మీద భర్తల నిరంకుశత్వాన్ని దుయ్యబట్టింది. ఓపికున్నంత వరకూ తిట్టింది. భర్తల మీద భార్యలందరూ తిరగబడాల్సిందే, దౌర్జన్యం సహించకూడదంటూ ఢంకా

బజాయించినట్లు చెప్పింది. వ్రాయడం పూర్తి అయ్యాక చూస్తే ఏక బిగిన ఐదారు పేజీలు తిట్లు-కసిగా నవ్వుకుంది. ఇది ఏదైనా పత్రికకు పంపించాలి. అంటే ఇన్ని తిట్లు తిడిడే బాగుండదేమో-అన్న అను మానం వచ్చి అందులోంచి కొన్ని తిట్లు తగ్గించి మళ్ళీవ్రాసింది విశా లాక్షి. 'భర్తల దౌర్జన్యం నశించాలి' అన్న శీర్షిక వ్రాసి తన అభిమాన స్త్రీల పత్రికకు పోస్టుచేసి తృప్తిగా నిట్టూర్చింది.

తాగి వచ్చినపుడు తప్ప విశాలాక్షి మొగుడు మంచి వాడే పాపం, సంవత్సరానికో సినిమాకు తీసుకు వెళ్తాడు కూడా. కానీ వచ్చిన గొడవల్లారోజూ నుక్కోసుకోందే ఇంటికి రాడు ప్రతీ రెండు రోజులకో సారి కారణమున్నా, లేకపోయినా భార్యని చితక్కొట్టడం అతని హాబీ. అందుకే ప్రతి రెండు రోజులకి భర్తమీద కోపం ప్రజ్వరిల్లుతునే ఉంటుంది విశాలాక్షికి.

X X X X

ఆ రోజు ఉదయం పోస్టులో పోస్టువాడు రెండు ఉత్తరాలతో బాటు ఒక పత్రిక కూడా పడేసి పోయాడు. ఆ సమయంలో విశాలాక్షి మొగుడికి అన్నం వడ్డిస్తోంది. పోస్టువాడిచ్చిన పత్రికను కళ్ళు విశాలం చేసి పేజీలు తిరగేస్తున్న విశాలాక్షి ఓ చోట, ఆగిపోయింది. ఆశ్చ ర్యంగా చూసింది. 'భర్తల దౌర్జన్యం నశించాలి-అనే శీర్షికతో వ్యాసం కింద ముచ్చటగా అచ్చులో విశాలాక్షి పేరు.... కలా, నిజమా అని కళ్ళు నులుముకుని మళ్ళీ చూసింది-పచ్చినిజం !

భోజనం ముగించి చెయ్యికడుక్కొచ్చిన విశాలాక్షి పతి దేవుడు ఆమె చేతిలో పుస్తకం గుంజుకున్నాడు దురుసుగా. 'ఏమిటిది' అని ప్రశ్నించేలోగానే శీర్షిక, కింద విశాలాక్షి పేరూ కనిపించినై: గబగబ అక్షరాల వెంట అతని కళ్ళు పరిగెత్తినై.

హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి దిమ్మెరపోయి నుంచుంది విశాలాక్షి. అచ్చులో తన వ్యాసం వస్తుందనీ అది ఇంత హఠాత్తుగా భర్త చేతిలో పడుతుందనీ ఆమె ఊహించలేదు. తను రచయిత్రి అయినందుకు భర్త మెచ్చుకుంటాడేమో! అని ఆలోచించే లోపలే భర్త ఆ పత్రికను విసిరి కొట్టాడు కోపంగా; నేలమీద కాదు విశాలాక్షి మొహం మీద. ఇష్టమొచ్చినట్లు తిట్ల పరంపరతో పాటు ఆమె ఒంటిమీద అతని చేతి వేళ్లు వాతలుగా తేలుతున్నై. "పిచ్చి రాతలు రాస్తావా? ఆడవాళ్ళం దర్నీ ఉద్ధరించేందుకు నువ్వు అవతారమెత్తావా? నీలాంటి వాళ్ళకి ఇంత తక్కువ డోసు సరిపోదే-ఇంకాస్త ఘాటుగా అంటించాలి. లేకపోతే మొగుళ్ళ దౌర్జన్యానికి ఎదురుతిరగమంటావా? ఏదీ, ఒక్కసారి ఎదురు తిరగవే అప్పుడు చూపిస్తా నా అసలు తడాఖా...." అంటూనే ఆమెను శక్తిమేరకు కొడ్తున్నాడా పతిదేవుడు. దెబ్బలకు ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తూనే నిస్సహాయంగా కొట్టొద్దని ప్రాధేయపడ్తోంది విశాలాక్షి.

"ఇంకెప్పుడన్నా ఇలాంటి పిచ్చిరాతలు రాశావంటే చంపేస్తా" అని ఒక హెచ్చరిక చేసి - ఆ పత్రిక చింపిపారేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు రుస రుసలాడుతూ.

కన్నీళ్ళ మధ్య కూర్చున్న విశాలాక్షిని పత్రికలోని 'రచయిత్రి విశాలాక్షి' జాలిగా చూస్తోంది. 'భర్తల దౌర్జన్యం నశించాలి' అన్న అక్షరాలన్నీ కలిసి ఆమెను పరిహసిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి 23-11-84)